# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రాన్ని 2047 నాటికి దేశంలోనే ప్రధమ స్థానంలో నిలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతిగా రఘురామకృష్ణం రాజు ఎన్నికయ్యారు.
- ❖ విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించగానే పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ నూతన పారిశ్రామికాభివృద్ధి విధానాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఈరోజు శాసనసభలో ప్రవేశపెట్టారు.
- ❖ విజయనగరం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఉపఎన్నికను ఎన్నికల సంఘం రద్దు చేసింది.

=============================

ఆంధ్రప్రదేశ్ ను 2047 నాటికి దేశంలోనే ప్రధమ స్థానంలో నిలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన ఈరోజు మాట్లాడుతూ... పరిశ్రమలకు ప్రోత్సాహమందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 22 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహాపరిశ్రమల స్థాపనే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలకు ఉత్తమ విధానం తీసుకువచ్చామని తెలిపారు. సులబతర వాణిజ్యం నుంచి.. వేగవంతమైన వాణిజ్య విధానాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

=============================

ఆంధ్రప్రదేశ్ ఉప శాసనసభాపతిగా పశ్చిమ గోదావారి జిల్లా ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణం రాజు ఎన్నికయ్యారు. ఈ పదవికి ఒక్క నామినేషనే దాఖలు కావడంతో రఘురామకృష్ణం రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘురామష్ణం రాజుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో సహ శాసనసభ్యులు అభినందనలు తెలియజేశారు.

============================

విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, వాటికి ఆమోదం లభించగానే మొదటి దశ పనులు ప్రారంభమవుతాయని విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. ఈరోజు విశాఖలో గ్రంధాలయ వారోత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు తొలిదశ కింద చేపట్టే నిర్మాణానికి 11 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయమని తెలిపారు. తదుపరి దశల్లో మరో రెండు మార్గాల్లో ప్రతిపాదనలు పంపించనున్నామని కలెక్టర్ వెల్లడించారు. మరోవైపు ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ సంచుల నిషేధాన్ని జనవరి ఒకటో తేదీ నుంచి జిల్లాలో అమలు చేస్తామని, విస్తృత అవగాహనతో పాటు, ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లతామని తెలియజేశారు. అలాగే పర్యాటక పరంగా విశాఖ జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు చేపట్టామన్నారు. గతంలో మంజూరైన టూరిజం హోటల్స్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు.

============================

రానున్న 5 సంవత్సరాల్లో 5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులే లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఏపీ పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0ను టీజీ భరత్ ఈరోజు శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇటీవల దుబాయ్‌లో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో రాష్ట్రంలో ఉన్న సానుకూలతల గురించి వివరించానని, ప్రత్యేకించి 83 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5 లక్షల ఉద్యోగాలతో పాటు, 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వాహనాలు, బయోటెక్నాలజీ, పునరుద్పాదక విద్యుత్, సెమీకండక్టర్ పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఉపాధి కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ విధానమని ముందుగా ఏర్పాటు చేసే 200 పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయని మంత్రి టీజీ భరత్ వివరిస్తూ..

(వాయిస్ 40 సెకన్లు)

============================

విజయనగరం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఉపఎన్నికను కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ... ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. శాసనమండలి సభ్యులు ఇందుకూరి రఘురాజుపై మండలి ఛైర్మన్ అనర్హతగా వేటు నిర్ణయాన్ని రఘురాజు హైకోర్టులో సవాల్ చేశారు. మండలి ఛైర్మన్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ఉన్నత న్యాయస్థానం.. అనర్హత వేటు చెల్లదని, అతను ఎమ్మెల్సీగా కొనసాగవచ్చని తీర్పునిచ్చింది. దీంతో ఉపఎన్నిక నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నామని ఎన్నికల సంఘం ప్రకటించింది.

విరామం

============================

నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి బాలలకు ఉజ్వల భవిష్యత్తు అందించే భాధ్యత ప్రతి ఒక్కరిది అని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈరోజు బాలల దినోత్సవం సందర్భంగా అరసవిల్లిలో చిల్డ్రన్స్ హోమ్ లో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ వేడుకలలో పాల్గొన్న కలెక్టర్ జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలలు ఎదిగే అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే భీమవరంలో జరిగిన బాలల దినోత్సవం కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ... భవిష్యత్తులో సమాజాన్ని నడిపించేది నేటి బాలలే అన్నారు. మంచి అలవాట్లను అలవరుచుకోవడం వలన మానసిక, శారీరక ఆరోగ్యం మెండుగా ఉంటుందన్నారు.

===========================

ఆధ్యాత్మిక విశిష్టత ప్రాచుర్యానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గొప్ప మార్గం చూపించారని, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాన్ మాట్లాడుతూ, ఉత్సాహం, జ్ఞాపకశక్తి, ఆలోచనశక్తిని పెంచే ప్రక్రియగా సుదర్శన క్రియకు గుర్తింపు ఉందని, అలాంటి యోగా ప్రక్రియను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి రవిశంకర్ అని కొనియాడారు.

===========================

ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం దేశంలోని నిరుద్యోగ యువతకు నూతన అవకాశాలను సృష్టిస్తోంది. ఇప్పటికే లక్షలాది మంది యువత ఈ కార్యక్రమం కింద రాయితీ రుణాలు పొంది తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎలా లబ్ధి పొందవచ్చో తెలియజేయడానికి అవగాహనా కార్యక్రమాన్ని ఈరోజు గుంటూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిపొందిన వారు తమ అనుభవాలను ఔత్సాహికులతో పంచుకున్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

===========================

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, దానికి అనగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సూచించారు. ఈరోజు విజయవాడలోని ఇంటర్ బోర్డు నిర్వహించిన కార్యశాలలో పాల్గొన్న మంత్రి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. పోటీ పరీక్షలను తట్టుకునేలా విద్యార్థును తీర్చిదిద్ది, వారిలో నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు.

===========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డి.ఎస్.సి. పరీక్ష అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని అనకాపల్లి ఎ.పి. బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్, కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు రెండు నెలలకు స్టైఫండ్ గా 3 వేల రూపాయలు, స్టడీ మెటీరియల్ అందిస్తామని ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 98858 45743 నెంబరుకు సంప్రదించాలని కె.రాజేశ్వరి తెలిపారు.

===========================

నైరుతి బంగాళాఖాతంలోని ఉత్తర తమిళనాడు తీర ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దక్షిణ తమిళనాడు పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. ఆంధ్ర ప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు

కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. అలాగే ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు.

==============================

==============================